7న నగరంలో సంక్రాంతి సంబరాలు

బెంగళూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ తెలుగు సంఘం తెలుగు విజ్ఞాన సమితి ఈ నెల 7న సంక్రాంతి సంబరాలను జరుపనుంది. ఈ మేరకు సమితి ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మీరెడ్డి నగరంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వయ్యాలికావల్‌లోని సమితి ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు గోపూజతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. సమితి అధ్యక్షుడు డాక్టర్. ఎ.రాధాకృష్ణరాజు అధ్యక్షత వహించనుండగా ఉపాధ్యక్షులు కె.గంగరాజు, ఆర్. ఆదికేశవులు నాయుడు, కోశాధికారి సీపీ వరదరాజుతో పాటు ఇతర పదాధికారులు కార్యవర్గ సభ్యులు పాల్గొంటారని తెలిపారు

అన్నింటిలోనూ అన్యాయమే..

- పన్నుల వాటాలో కోతలు
- 15వ ఆర్థిక కమిషన్ గ్రాంట్లలోనూ..
- కరువు సాయంలో మొండిచేయి : కేంద్రంపై సర్కార్ గరం

బెంగళూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాల్సిన అన్ని నిధుల్లోనూ అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార కాంగ్రెస్‌కు ప్రధాన ప్రతిపక్షమైన బీజేపీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. హుబ్బళ్ళిలో కరసేవకుడి అరెస్టుతో బీజేపీ చేతికి బ్రహ్మాస్త్రం లభించినట్లయింది. సిద్ధరామయ్య నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హిందూ వ్యతిరేకిగా ముద్ర వేయడం ద్వారా ఇరుకున పెట్టే యత్నాలను బీజేపీ ముమ్మరం చేసింది. అయితే బీజేపీ మతోన్మాద అజెండాను తిప్పికొట్టేందుకు ప్రభుత్వం కూడా తన అస్త్రాలకు పదును పెడుతోంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళడం ద్వారా బీజేపీ వ్యూహాలకు చెక్‌పెట్టే సన్నాహాల్లో ఉంది.

ఇచ్చింది తక్కువ.. రావాల్సింది ఎక్కువ

రాష్ట్రానికి 15వ ఆర్థిక కమిషన్ గ్రాంట్ల విషయానికి వస్తే మూడేళ్ళలో విడుదలైన మొత్తం తక్కువ కాగా రావాల్సిన మొత్తం అధికంగా ఉందని ప్రభుత్వ వర్గాలు గురువారం వెల్లడించాయి. 2021 నుంచి 2026 కాలానికి అంటే ఐదేళ్ళకు గాను స్థానిక సంస్థలు, ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ, ఆరోగ్య రంగాలకు కలిపి కమిషన్ చేసిన సిఫార్సుల ప్రకారం రూ 29,110 కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఇందులో స్థానిక సంస్థలకోసం కేటాయించిన గ్రాంట్ల మొత్తం రూ 21,877 కోట్లుగానూ, ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ గ్రాంట్లు రూ 4,369 కోట్లుగానూ, రాష్ట్ర పనుల వాటా తర్వాత ఆదాయం కొరత కోసం ఇచ్చే గ్రాంటు రూ.1631 కోట్లుగానూ, ఆరోగ్య రంగానికి మంజూరైన రూ.1233 కోట్లు ఉన్నాయి. అయితే గత మూడేళుగా రాష్ట్రానికి విడుదలైన గ్రాంటు మొత్తం రూ 11,449 కోట్లుమాత్రమేనని ఈ వ ర్గాలు వెల్లడించాయి. ప్రత్యేకించి కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు రావాల్సిన గ్రాంటు రూ 14,630 కోట్లు ఇంకా విడుదల కాలేదని ఈ వర్గాలు తెలిపాయి. అయితే రాష్ట్రంలో జిల్లా పంచాయితీ, తాలుకా పంచాయితీలకు ఇంకా ఎన్నికలు నిర్వహించలేదన్నకారణంగానే కేంద్రం 15వ ఆర్థిక సంఘం సిఫార్సుచేసిన మేరకు గ్రాంట్లను విడుదల చేయలేదని అధికార వర్గాలు తెలిపాయి.

పన్నుల వాటా విడుదలలోనూ అన్యాయం

కేంద్రం ప్రభుత్వ ఖజానాకు రాష్ట్రంనుంచి అధికమొత్తం అందుతున్నా రాష్ట్ర వాటా విడుదల్లోనూ తీరని అన్యాయం జరుగుతోందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రతి ఏడాది రాష్ట్ర వాటా మొత్తం తగ్గుతూ వస్తోందని తెలిపాయి. ఇదే అంశాన్ని 16 ఆర్థిక కమిషన్ ముందుకు బలంగా తీసుకెళ్ళాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు సమాచారం. బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్‌లతో పోల్చితే కర్ణాటకు మాత్రం వాటా విషయంలో తారతమ్యం బాగా కనిపిస్తోందని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. కర్ణాటకకు లభిస్తున్న వాటా రూ.37,252 కోట్లుగా ఉందని తెలిపారు. అన్యాయానికి గురవుతున్న రాష్ట్రాలను కలుపుకుని కేంద్రంపై పోరాడేందుకు సిద్ధమని ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారుడు ఎమ్మెల్యే బసవరాజ రాయరెడ్డి పేర్కొన్నారు. నగరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేకించి ఇలా అన్యాయానికి గురవుతున్న మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లను కలుపుకుని ముందుకు సాగుతామన్నారు. కేంద్రం నుంచి గ్రాంట్లు కోరడం లేదని రాష్ట్రానికి న్యాయబద్ధంగా దక్కాల్సిన గ్రాంట్లు, పన్నుల్లో వాటాను మాత్రమే కోరుతున్నామని, రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయంపై సోదాహరణంగా త్వరలోనే ఒక శ్వేతపత్రాన్ని కూడా విడుదల చేసే ఆలోచన ఉందన్నారు. కేంద్రంతో ఘర్షణకు దిగడం లేదని దక్కాల్సిన వాటా గురించే మాట్లాడుతున్నామని చెప్పారు.



కరువుసాయం విడుదలలో మొండిచేయి

రాష్ట్ర రైతాంగం గత మూడు నెలలుగా వర్షాభావ స్థితి కారణంగా పంటలు ఎండిపోయి తీవ్ర కరువు కాటకాలను ఎదుర్కొంటున్నా కేంద్రం కనికరం చూపడం లేదని రెవెన్యూ శాఖా మంత్రి కృష్ణబైరెగౌడ వాపోయారు. నగరంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ కరువుసాయం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వయంగా ఢిల్లీకి వెళ్ళి ప్రధాని మోదీతో సమావేశమై విన్నవించుకున్నా ఒక్కపైసా విడుదల కాలేదన్నారు. ఉద్దేశ్యపూర్వకంగానే సాయం చేయడం లేదన్న అభిప్రాయం ప్రజల్లో నెలకొని ఉందన్నారు. మొత్తానికి కావేరి జలాల వివాదం, మేకెదాటు ప్రాజెక్టు వివాదం ఇత్యాది అంశాలలోనూ రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం గాలికి వదిలేసిందని ప్రభుత్వం అంటోంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 25 మంది ఎంపీలను గెలిపించినా రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై నోరు మెదపలేదని ఇవి కూడా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమ ప్రచారాస్త్రాలుగా ఉంటాయని కేపీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే .శివకుమార్ గురువారం ఢిల్లీకి వెళ్ళబోయే ముందు మీడియాకు వెల్లడించారు.

హిందువులే టార్గెట్

- అరెస్టులతో అశాంతి సృష్టించేందుకు ప్రభుత్వ యత్నం: బీజేపీ
- పచ్చి అబద్ధాలని కొట్టిపారేసిన సీఎం



చిక్క మగళూరులో సీటీ రవి ఆందోళన

బెంగళూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిరం ప్రారంభం కానుండటాన్ని జీర్ణించుకోలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులను టార్గెట్ చేస్తోందని తద్వారా రాష్ట్రంలో అశాంతి వా తావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని బీజేపి తీవ్ర ఆరోపణ చేసింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రాజీవ్ నగరంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ వినాశ కాలే విపరీత బుద్ధి అన్న చందాన ఒక పక్క 30 సంవత్సరాల నాటి కేసులను తిరగతోడి కరసేవకుల్ని అరెస్టు చేస్తోందని ఇది చాలదన్నట్లు తా జాగా ఇప్పటికే ముగిసిన దత్తపీఠం కేసును రీ ఓపెన్ చేశారని మండిపడ్డారు. ఇది హిందువుల మనోభావాలతో చెలగాటమాడటమేనన్నారు. కాంగ్రె స్ కు కుక్కర్ బాంబులు పేల్చిన వారు బ్రదర్స్‌గానూ, రాముడి భక్తులు క్రిమినల్స్‌గానూ కనిపిస్తున్నారని ఆయన విరుచుకుపడ్డారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఇందుకు కాంగ్రెస్ భారీగా మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు.

బీజేపీవి పచ్చి అబద్ధాలు...

చిక్కమగళూరులోని బాబాబుడన్‌గిరి కొండలపై గతంలో ఘోరీల ధ్వంసం కేసును రీ ఓపెన్ చేసినట్లు కొన్నిచానెళ్ళలో వచ్చిన కథనాలు పూర్తిగా నిరాధారమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టంచేశారు. నగరంలో గురువారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంలో బీజేపీ పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తోందన్నారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని మీడియాకు విడుదల చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకే నిందితులను కోర్టుకు హాజరు కావాల్సిందిగా సమన్లు జారీ అయ్యాయన్నారు. కోర్టు ఆదేశాలను కూడా రాజకీయం చేయడం బీజేపీకే చెల్లిందన్నారు. ప్రభుత్వంపై బురద జల్లుతూ నిరాధార కథనాలు పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తూ విశ్వసనీయతను పోగొట్టుకోవద్దని మీడియాకు సీఎం హితవు పలికారు.

హిందూ కార్యకర్త అరెస్ట్‌పై నిరసన

హుబ్బళిలో హిందూకార్యకర్త శ్రీకాంత్ పూజారి అరెస్టును నిరసిస్తూ బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే, పార్టీ ప్రధానకార్యదర్శి సునిల్ కుమార్ ఒంటరిగా నిరసనకు దిగారు. గురువారం సదాశివనగర్ పోలీసుస్టేషన్ ఎదుట ప్లకార్డుతో ఒంటరిగా వచ్చి బైఠాయించారు. అయోధ్యలో 30 ఏళ్ళ కిందట జరిగిన సంఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షగట్టి కార్యకర్తలను వేధించాలని చూస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న ప్రతిసారి హిందూ కార్యకర్తలకు వేధింపులు కొనసాగాయన్నారు. పోలీసులు నిరసన విరమింప చేయాలని సూచించారు. అయన ససేమిరా అనడంతో అరెస్టు చేశారు. విషయం తెలియగానే స్థానిక కార్యకర్తలు ఎమ్మెల్యే సునిల్‌కుమార్‌కు అండగా నిలిచారు. జైశ్రీరాం అంటూ నినాదాలు చేశారు. కాగా చిక్కమగళూరు పోలీసుస్టేషన్ ఎదుట బీజేపీ సీనియర్‌నేత సీటీ రవి నిరసనకు దిగారు. హిందూకార్యకర్త శ్రీకాంత్ పూజారి అరెస్టుకు నిరసనగా ఆందోళన చేశారు. ఆయనకు మద్దతుగా కార్యకర్తలు భాగస్వామ్యులయ్యారు.



ఎమ్మెల్యే సునిల్ కుమార్ నిరసన

బంద్ సంపూర్ణం

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక భావనలకు భంగం కలిగించిన వ్యక్తులను అరెస్టు చేయాలన్న డిమాండ్‌తో గురువారం చేపట్టిన నంజనగూడు బంద్ సంపూర్ణమనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం దాకా స్వచ్ఛందంగా బంద్ సాగింది. పోలీసులు ముందు జాగ్రత్తగా భారీ బందోబస్తు చర్యలు తీసుకున్నారు. శ్రీకంఠేశ్వర భక్తుల పేరిట బంద్‌కు అనుమతులు లేవని పోలీసులు ప్రకటించినా స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. ఉత్సవ విగ్రహాలపై నీళ్ళుచల్లిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకోవడం అందరి హక్కని, అందరి మనోభావాలు దెబ్బ తినేలా ప్రవర్తించడం సరి కాదని వారు అభిప్రాయపడ్డారు. అత్యవసర సేవలు మినహా ఎటువంటి వ్యాపారాలు సాగలేదు. నంజనగూడు సంఘటనపై మైసూరు జిల్లా బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో కోటె ఆంజనేయస్వామి ఆలయ ఎదురు నిరసన తెలిపారు.

ఆవిష్కరణల భారత్‌లో విద్యార్థులు భాగస్వాములు కావాలి

- పీఈఎస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దొరస్వామి

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే సాంకేతిక ఆవిష్కరణలకు భారతావని కేంద్రంగా మారుతున్న వే ళ యువ విద్యార్థులు భాగస్వామ్యులు కావడం ద్వారా మరిన్ని పరిశోధనలు సాధించాలని పీఈఎస్ యూనివర్శిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి అభిప్రాయపడ్డారు. పీఈఎస్ విద్యాసంస్థలు ఆరంభమై 50 ఏళ్ళు పూర్తీ అయిన సందర్భంగా వ్యవస్థాపక ఛైర్మన్ హోదాలో దొరస్వామి స్వర్ణోత్సవాలను లాంఛనంగా ఆరంభించారు. నాలుగురోజుల పాటు సాంకేతిక సదస్సులలో భా గంగా బుధవారం ప్రముఖుల అనుభవ ప్రసంగాలతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థులకు దిశానిర్దేశం చేశాయి. దొరస్వామి మాట్లాడుతూ సరిగ్గా 50 ఏళ్ళకిందట అకస్మికంగా విద్యాసంస్థ ప్రారంభించానని అందుకు మార్గదర్శకులు దయానందసాగర్ కారకులని స్మరించుకున్నారు. కేవలం 40 మంది విద్యార్థులతో పీయూసీ తరగతుల ద్వారా పీఈఎస్ విద్యా సంస్థ ఆరంభం కాగా గుణాత్మకత, నైతికవిలువలకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ప్రస్తుతం బెంగళూరుతో పాటు కుప్పం మెడికల్ కళాశాలలతో కలిపి 40 కోర్సుల ద్వారా ఏటా 25వేల మంది విద్యార్థులు పీఈఎస్‌లో చేరుతున్నారన్నారు. ప్రతి వ్యక్తి జీవిత కాలం విద్యార్థిగా ఉంటేనే ఉన్నత స్థాయికి చేరుతారన్నారు. ఇన్ఫోబి గ్రూప్ ఫౌండర్ సీఈఓ నవీన్ తివారీ మాట్లాడుతూ దశాబ్దంలో సాంకేతికతలో ఊహించని పరిశోధనలు సాధ్యమయ్యేందుకు పీఈఎస్ వంటి విద్యాసంస్థలు మార్గదర్శకంగా అభివర్ణించారు. ఐటీ, బీటీ, రక్షణ రంగాలలోనే కాకుండా అధునాతన రోబోటిక్, చిప్ టెక్నాలజీ ద్వారా విశ్వానికే భారత్ దిశానిర్దేశం చేసే స్థాయికి కారణమవుతోందన్నారు. బెంగళూరులోనే స్టార్టప్‌లు అత్యధికంగా ప్రారంభమయ్యేందుకు ఇక్కడి ఇంజనీరింగ్ కళాశాలలో సాగుతున్న విద్యావిధానమే ముఖ్యమన్నారు. పూర్వ విద్యార్థులు రామన్, లక్ష్మణ్‌లు పుట్టుకతోనే వినికిడి లోపం ఉన్నవారి కోసం అందుబాటు ధరలలో శ్రవణ సాధనాలను ఆవిష్కరణలపై వివరించారు. శస్త్రచికిత్స వంటి భారీ ఖర్చుల నుంచి ఉపశమనం కలిగించామని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారులు అభినందించారన్నారు. లోవస్ సర్వీస్ ఇండియా మార్కెటింగ్ డైరెక్టర్ రమ్యా విశ్వనాథ్ మాట్లాడుతూ గ్లోబుల్ మా ర్కెటింగ్ విధానాల గురించి వివరించారు. కేంద్రప్రభుత్వ ఆర్థిక సలహాదారుడు శ్రేయా సహోసూరు మాట్లాడుతూ పీఈఎస్ విద్యార్థిగా గర్వపడుతున్నట్లు అభిప్రాయపడ్డారు. 2009లో ఇక్కడే ఇంజనీరింగ్ పూర్తీ చేసి ఐఏఎస్ వైపు వెళ్ళినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యతలు ప్రజా జీవనాలకు సులభతరం చేసేందుకు పలు పథకాలను అనుసంధానం చేశామన్నారు. నా ఎదుగుదలకు పీఈఎస్ విద్యాసంస్థ గుణాత్మక విద్య కారణంగా వివరించారు. అబ్బి, అనన్యల సంగీత కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది



పీఈఎస్ స్వర్ణోత్సవాల ప్రారంభంలో చాన్స్‌లర్ దొరస్వామి, జవహర్ తదితరులు

ఐదేళ్ళపాటు సిద్ధరామయ్యే సీఎం

- సీఎం ఆర్థిక సలహాదారు రాయరెడ్డి

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి మార్పుకు సంబంధించి ఎలాంటి ఒప్పందం కుదరలేదని ఐదేళ్ళ పాటు సిద్ధరామయ్యే సీఎంగా కొనసాగుతారని ఆయన ఆర్థిక సలహాదారుడు బసవరాజ రాయరెడ్డి పేర్కొన్నారు. సీఎం పదవికి సంబంధించి ఎవరూ నోరు మెదపవద్దని అధిష్టానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా తాజాగా పార్టీ సీనియర్ ఎమ్మెల్యే బసవరాజ రాయరెడ్డి వ్యాఖ్యలు చేయడం సర్వత్రా కుతూహలం రేకెత్తిస్తోంది. మంత్రి పదవి దక్కకపోవడంతో సీఎంపై నిన్న మొన్నటి వరకు కారాలు మిరియాలు నూరిన రాయరెడ్డి కేబినెట్ స్థాయి హోదా కలిగిన పదవి దక్కడంతో ఒక్కసారిగా తన స్వరాన్ని మార్చేయడం గమనార్హం. రెండున్నర సంవత్సరాల పాటు మాత్రమే సిద్ధరామయ్య ముఖ్యమంత్రి అని ఏదైనా ఒప్పందం కుదిరిందా? ఇలాంటి ఒప్పందం గురించి శాసనసభా పక్ష సమావేశంలో తమకు ఎవరూ ఏమీ చెప్పలేదని రాయరెడ్డి పేర్కొన్నారు. సిద్ధరామయ్య ఐదేళ్ళపాటు సీఎంగా కొనసాగుతారన్నది తన వ్యక్తిగత అభిప్రాయమని ఆయన వెల్లడించారు. సిద్ధరామయ్య జనాదరణ చూరగొన్న నేత, మంచి పాలన అందిస్తున్నారు, అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారు 90 శాతం మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా ఆయన పై అపార విశ్వాసాన్ని కలిగి ఉన్నారని రాయరెడ్డి పేర్కొన్నారు. 2013లో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సిద్ధరామయ్య ఏ విధంగా పనిచేసేవారో ఇప్పుడు కూడా అలాగే పనిచేస్తున్నారని ఆయనలో తనకు ఎలాంటి మార్పూ కనిపించడం లేదన్నారు. కాకపోతే అప్పుడు సీఎంగా ఉన్న సమయంలో ఆయన వయస్సు 66 సంవత్సరాలు ఇప్పుడు 76 సంవత్సరాలు అంతే అంటూ ఆయన చలోక్తి విసిరారు. సలహాదారుల పదవులను భర్తీచేస్తూ సీఎం గంజికేంద్రాలను తెరిచారంటూ మాజీ సిఎం హెచ్‌డి.కుమారస్వామి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సీఎంగా పనిచేసిన కుమారస్వామి ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న తాను ఇంతవరకు ఎలాంటి వేతనం గానీ జీత భత్యాలు గానీ తీసుకోలేదని మరి ఇది గంజికేంద్రమా? అని ఆయన కుమారస్వామిని నిలదీశారు.



నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

షాజహాన్ (జయంతి)



మొఘల్ చక్రవర్తి షాజహాన్ 1592 జనవరి 5న జహంగీర్‌కు జన్మించారు. 1628 నుంచి 1658వరకు పాలించారు. పలు చారిత్రక కట్టడాలు నిర్మించారు. భార్య ముంతాజ్ బేగం జ్ఞాపకార్థం ఆగ్రాలో తాజ్‌మహల్ నిర్మించారు. ఇది ప్రపంచంలోనే 'ప్రేమ'కు ప్రతిరూపంగా నిలిచింది. 'కోహినూర్' వజ్రంతోపాటు లెక్కకుమిక్కిలి సంపద కలిగిన రాజుగా పేరొందారు. 1666 జనవరి 31న కన్నుమూశారు.

పరమహంస యోగానంద (జయంతి)



పరమహంస యోగానంద 1893 జనవరి 5న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌లో జన్మించారు. బెంగాల్‌కు చెందిన యోగి. అసలుపేరు ముకుందలాల్ ఘోష్. 1916లో సన్యాస ఆశ్రమ ధర్మాన్ని స్వీకరించి యోగానందగిరి అయ్యారు. సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ (ఎస్ఆర్ఎఫ్), భారత యోగదా సత్సంగ సొసైటీ (వైఎస్ఎస్)ల ద్వారా ధ్యానం, క్రియా యోగాల గురించి నేర్పించేవారు. 1946లో ఆయన రాసిన 'ఒక యోగి ఆత్మకథ' పుస్తకం విమర్శకుల ప్రశంసలను అందుకుని ఇప్పటివరకు 40లక్షల కాపీలకుపైగా అమ్ముడైంది. 1952 మార్చి 7న నిర్యాణం చెందారు.

పటౌడీ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత నవాబ్ మొహమ్మద్ మన్సూర్ అలీఖాన్ సిద్దిఖి పటౌడీ 1941 జనవరి 5న జన్మించారు. 'టైగర్ పటౌడీ'గా పేరొందారు. భోపాల్‌ను పాలించిన చివరి నవాబ్ మనవడు. క్రికెటర్‌గా రాణించారు. 21వ ఏటనే భారతజట్టుకు కేప్టెన్‌గా వ్యవహరించి ఆల్‌రౌండర్‌గా రాణించారు. 'ఇండియాస్ గ్రేటెస్ట్ కేప్టెన్'గా, బెస్ట్ ఫీల్డర్ ఇన్ ది వరల్డ్‌గా పేరొందారు. నటి షర్మిలా ఠాగూర్‌ను పెళ్ళాడాడు. కుమారులు సైఫ్ అలీఖాన్, సోహా అలీఖాన్‌లు నటులు. 2011 సెప్టెంబరు 22న కన్నుమూశారు.

మురళీ మనోహర్ జోషి (పుట్టినరోజు)



'పద్మవిభూషణ్' గ్రహీత మురళీ మనోహర్‌జోషి 1934 జనవరి 5న ఉత్తరాఖండ్‌లో జన్మించారు. బీజేపీ అగ్రనేతలలో ఒకరు. 1991 నుంచి 93వరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరించారు. కాన్పూర్ నుంచి ఎంపీగా కొనసాగారు. ఎన్డీయే హయాంలో కేంద్రమంత్రిగా కొనసాగారు. అంతకుముందు ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా అలహాబాద్ యూనివర్సిటీలో పనిచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబాపులె, దీన్‌దయాల్ ఉపాధ్యాయ వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని సాగుతున్నారు.

మమతా బెనర్జీ (పుట్టినరోజు)



మమతా బెనర్జీ 1955 జనవరి 5న కోల్కత్తాలో జన్మించారు. దేశంలో పేరొందిన రాజకీయ మహిళానేత. పశ్చిమబెంగాల్‌కు 9వ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వేరై ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. అభిమానులచే 'దీదీ'గా పిలవబడుతున్నారు. ప్రధాని పీవీ నరసింహారావు కేబినెట్‌లో కేంద్రమంత్రిగా వ్యవహరించారు. రచయిత, చిత్రకారిణి కూడా. 2012లో ప్రపంచంలో ప్రభావశీలురైన 100మందిలో ఒకరిగా నిలిచారు. కోల్కత్తా యూనివర్సిటీనుంచి, కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

బ్రాడ్‌లీ కూపర్ (పుట్టినరోజు)



బ్రాడ్‌లీ కూపర్ 1975 జనవరి 5న పెన్సిల్వేనియాలో జన్మించారు. అమెరికాకు చెందిన నటుడు, దర్శకుడు. ప్రపంచంలో అత్యధిక రెమ్యూనరేషన్ అందుకున్న నటుడిగా నాలుగు సార్లు నిలిచారు. ఫోర్బ్స్ సెలెబ్రిటీ 100 జాబితాలో మూడుసార్లు నిలిచారు. 2015లో టైమ్స్ అత్యంత ప్రభావశీలురైన వందమందిలో ఒకరు. 2 గ్రామీ అవార్డులు, ఒక బాఫ్టా అవార్డు పొందారు. పలు అవార్డులకు ఎంపికయ్యారు. కాగా కేన్సర్ బాధితులకు పలు చారిటీ కార్యక్రమాలతో ఆదుకుంటున్నారు.

దీపికా పదుకొనె (పుట్టినరోజు)



దీపికా పదుకొనె 1986 జనవరి 5న జన్మించారు. ఆమె తల్లిదండ్రులు కర్ణాటక రాష్ట్రం ఉడుపి జిల్లా కుందాపుర తాలూకాకు చెందిన వారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు ప్రకాశ్ పదుకొనె కుమార్తె. ఆమె కూడా జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఆడారు. అయితే ఫ్యాషన్, మోడల్ కోసం క్రీడలను వదిలేశారు. తర్వాత వెండితెరపై రాణించారు. 'ఐశ్వర్య' అనే కన్నడ సినిమాతో తెరంగేట్రం చేశారు. అత్యధిక రెమ్యూనరేషన్ పొందేస్థాయికి చేరారు. 3 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు పొందారు. నటుడు రణవీర్‌సింగ్‌ను పెళ్ళి చేసుకున్నారు.

బీజేపీ అధికార ప్రతినిధిగా అశ్వత్థనారాయణ

● సోషల్ మీడియా ఇన్‌చార్జిగా ప్రశాంత్‌మాకనూరు



బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బీజేపీ అధికార ప్రతినిధిగా మాజీ ఎమ్మెల్సీ అశ్వత్థనారాయణను నియమించారు. రాష్ట్ర బీజేపీ కమిటీలను బలోపేతం చేసే దిశగా అధ్యక్షులు విజయేంద్ర పలు కమిటీలను గురువారం ప్రకటించారు. అధికార ప్రతినిధులుగా 11 మందిని ఖరారు చేశారు. వీరు ఇకపై పార్టీకు సంబంధించి వివిధ టెలివిజన్ ఛానల్స్‌లోనే కాకుండా ఇతరత్రా అంశాలపై స్పందిస్తుంటారు. ప్రధాన అధికార ప్రతినిధిగా అశ్వత్థనారాయణను మరోసారి కొనసాగించారు. సీనియర్ పాత్రికేయుడు హరిప్రకాశ్ కొణెమనె, ఎమ్మెల్సీలు చలవాది నారాయణస్వామి, తేజస్వినీగౌడ, కెఎస్ నవీన్, ఎంజీ మహేష్, హెచ్ఎన్ చంద్రశేఖర్, డాక్టర్ నరేంద్రరంగప్ప, సురభి హరాదిగెరె, అశోక్ కెఎంగౌడ, హెచ్.వెంకటేష్ దొడ్డేరిలు ఉన్నారు. ఇక సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా ప్రశాంత్ మాకనూరు. సహ సంచాలకులుగా నరేంద్రమూర్తిలను నియమించారు. ఐటీ విభాగం కోఆర్డినేటర్ నితిన్‌రాజ్ నాయక్, సహ కోఆర్డినేటర్‌గా శ్యామలారఘు, మీడియా కోఆర్డినేటర్‌గా కరుణాకరఖాసలెను మరోసారి కొనసాగించారు. సహాయ కోఆర్డినేటర్‌గా ప్రశాంత్ కడంజిలను నియమిస్తూ జాబితాను విడుదల చేశారు.

అయ్యప్పకు 7వేల కొబ్బరి కాయలు..



బెంగళూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామికి భక్తులు 7వేల టెంకాయలు సమర్పించారు. బెంగళూరు బాణసవాడి సుబ్బణ్ణ పాళ్యలోని అయ్యప్పస్వామి ఆలయంలో వార్షిక పూజలు బుధవారం భక్తి శ్రద్ధలతో జరిగాయి. ప్రతియేటా ఇరుముడి ధరించి మకరజ్యోతికి ముందే భక్తులు శబరిమలైకు వెళ్ళేముందు ఇలా కొబ్బరికాయలు కొట్టడం ఆనవాయితీగా ఉంది. ఆలయ పాలక మండలి సభ్యుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలో ఒక గంటలోపే 7వేల కొబ్బరికాయలను కొట్టారు. దృశ్యాన్ని చూసేందుకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరయ్యారు. అందరినీ అయ్యప్పస్వామి చల్లగా చూడాలన్న సంకల్పంతోనే కొబ్బరికాయలు కొడతామని ఆలయ పాలక మండలి సభ్యులు తెలిపారు.

పూజల్లో పాలక మండలి సభ్యులు

13న ఐడియాథాన్ ఫైనల్ రౌండ్స్

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బ్రాండ్ బెంగళూరు ఐడియాథాన్ 2023 ఫైనల్ రౌండ్ పోటీలు ఈ నెల 13న యూత్ లీడర్‌షిప్ సమ్మేళనంలో జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో విద్యార్థులతో సంవాదం జరుపనున్నారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్మన్ సుధామూర్తి, నటుడు రమేష్ అరవింద్, అభివృద్ధి కమీషనర్ షాలిని రజనీష్, అతిథులుగా పాల్గొననున్నారు. గ్రేక్యాప్స్ నాలెడ్జ్ ట్రైబ్, విద్యానిపుణుడు గిరి పిక్ బ్రైన్ సుబ్రమణియన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మొత్తం 50 పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ ఐడియాథాన్ పోటీలకు ఎంపికయ్యారు. పలు వడపోతల అనంతరం 25 పాఠశాలలు ఎంపికయ్యాయి. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడానికే ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వీటిలో బనశంకరి ప్రెసిడెన్సీ పాఠశాల, ఎస్‌జెఆర్ కింగేరి పబ్లిక్ పాఠశాల, ఆర్కిడ్ ఇంటర్నేషనల్ పాఠశాల, సెయింట్ మార్క్స్ కాన్వెంట్, బనశంకరికి చెందిన నేషనల్ హిల్ వ్యూ పబ్లిక్ పాఠశాల, మిత్రా అకాడమీ, కస్తూరి నగర ప్రెసిడెన్సీ పాఠశాల ఉన్నాయి. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కుమార్తె ఐశ్వర్య ఈ కార్యక్రమం రూపకర్త కావడం విశేషం.

ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బెంగళూరు కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు అనుబంధమైన క్యాబ్ సంస్థ మహిళా ఉద్యోగి నేత్రా(27) అదృశ్యంపై కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. తుమకూరుకు చెందిన నేత్రా ఎయిర్‌పోర్టు టర్మినల్-1లో డబ్ల్యూఐటీ క్యాబ్ కంపెనీలో బుకింగ్ ఏజెంట్‌గా పనిచేసేవారు. ప్రతిరోజూ కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి పలకరించే నేత్రా డిసెంబరు 29న మధ్యాహ్నం రాత్రి డ్యూటీ ఉందనే సమాచారం ఇచ్చారు. ఆతర్వాత నేత్రా కనిపించకుండా పోయారు. ఎయిర్‌పోర్టులో పనిచేస్తూ ఇక్కడికి సమీపంలోనే ఉండే హుణసమారేనహళ్ళిలో పీజీలో బసచేసేవారు. సుమారు రెండురోజుల పాటు ఫోన్ పనిచేసినా ఎవరి కాల్స్ స్వీకరించేవారు కాదని తాజాగా బుధవారం నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ అయినట్లు నేత్రా సోదరుడు మహేష్ గురువారం మీడియాకు తెలిపారు. నేత్రా ఫోన్‌కు అందుబాటులోకి రాకపోవడంతో వెంటనే అప్రమత్తమయ్యామన్నారు. మరుసటి రోజునే బెంగళూరుకు వచ్చి ఎయిర్‌పోర్టుతో పాటు బసచేసే పీజీ వద్ద వెతికి తోటి మిత్రులు, ఉద్యోగులను ఆరా తీశామన్నారు. ఆచూకీ లభించకపోవడంతో 1న సోమవారం ఎయిర్‌పోర్టు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

బీబీఎంపీ కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడిగా నందకుమార్

బెంగళూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షునిగా జీఎం.నందకుమార్ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంతవరకు అధ్యక్షుడిగా ఉన్న ఆర్.అంబికా పతి గత ఏడాది నవంబరు 27న గుండెపోటుకు గురై మృతి చెందిన కారణంగా సంఘం పదాధికారులు, కార్యవర్గ సభ్యులు సమావేశమై నందకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంబికా పతి ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతానని నందకుమార్ గురువారం మీడియాకు వెల్లడించారు. బీబీఎంపీ కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేయాలని ఆయన బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్‌కు విజ్ఞప్తిచేశారు. కాంట్రాక్టర్ల సంఘానికి రాజకీయాలతో సంబంధం లేదన్నారు.

298 మందికి కొవిడ్ పాజిటివ్

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గురువారం 298మందికి కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. బెంగళూరులో 172 మంది, హాసన్ 19, మైసూరు 18, మండ్య, దక్షిణకన్నడ జిల్లాలో 11 మంది చొప్పున పాజిటివ్ నిర్ధారణ కాగా మిగిలిన జిల్లాలో పదిలోపు కేసులు నమోదయ్యాయి. 229 మంది డిశ్చార్జి కాగా నలుగురు మృతి చెందారు. 1240 మంది చికిత్సలు పొందుతున్నారు. 1168 మంది ఇళ్ళలోనే చికిత్స పొందుతుండగా, మిగిలిన వారు ఆసుపత్రుల్లో ఉన్నారు.

మా కుటుంబీకులెవరూ ఎన్నికల్లో పోటీ చేయరు

మంత్రి సతీష్ జార్కిహోళి

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే ఆసక్తి నాకు లేదని ప్రజాపనుల శాఖా మంత్రి సతీష్ జార్కిహోళి స్పష్టం చేశారు. గురువారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ బెళగావి లేదా చిక్కోడి లోక్‌సభ స్థానాల నుంచి తన కుటుంబానికి చెందిన ఎవరూ పోటీ చేసేది లేదని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలకు అవకాశం లభించనుందన్నారు. అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమన్నారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభం వ్యక్తి ప్రదర్శనగా సాగుతోందని విచారం వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను మినహాయిస్తే ఇతర ముఖ్యమంత్రులను ఎవరినీ ఆహ్వానించలేదన్నారు. తనకు ఆహ్వానం వచ్చినా వెళ్ళేది లేదన్నారు. మా పల్లెలో రామ మందిరం ఉందని అక్కడే పూజ చేస్తానన్నారు.



పుస్తకాన్ని బహూకరిస్తున్న మాజీ ఛైర్మన్ కె.రవీంద్ర శెట్టి

'అలెమారి జీవన' పుస్తకాల ప్రదానం

బెంగళూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల జీవన స్థితిగతులకు అద్దంపట్టే అలెమారి జీవన పుస్తకాన్ని నగరంలోని పలువురు ప్రముఖులకు కర్ణాటక అలెమారి అభివృద్ధి కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ కె.రవీంద్ర శెట్టి గురువారం అందజేశారు. బనశంకరి దేవాలయం ఛైర్మన్ బీజేపీ నేత డా.ఎహెచ్.బసవరాజుకు ఈపుస్తకాన్ని అందజేశారు. తాను ఛైర్మన్‌గా ఉన్న సమయంలో సంచార జాతుల సంక్షేమానికి చేపట్టిన పలు కార్యక్రమాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా అలెమారి జాతుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎం. ప్రకాష్, కార్యాధ్యక్షుడు శంకర్ హెబ్బాళ్ళి, సంఘం ప్రముఖులు శ్రీనివాస్, మాగడి మారప్ప తదితరులు హాజరయ్యారు.

విడాకులివ్వకపోతే అశ్లీల వీడియోలు వైరల్ చేస్తా

● భార్యకు వేధింపులు ● ఫిర్యాదుతో భర్త అరెస్ట్



[illegible]

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వివాహ బంధం అంటే జీవితకాలం కలిసి ఉండాలనేది. కానీ ఇటీవల కాలంలో అర్థం లేని రీతిలో వ్యవహరించేవారు తరచూ తెరపైకి వస్తున్నారు. జిల్లా కేంద్రమైన బెళగావిలో ఓ భర్త ఏకంగా భార్యను విడాకులు ఇవ్వకపోతే అశ్లీల వీడియోలు వైరల్ చేస్తానని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారు. బెళగావిలో నివసించే కిరణ్‌పాటిల్‌కు కొన్నేళ్ళ కిందట వివాహమయ్యింది. ఇటీవలే ఇరు[illegible]యి. భార్యతో ఏకాంతంలో ఉండే ఫోటోలు, వీడియో రికార్డులు చేసుకున్న భర్త వాటి ద్వారానే బెదరింపులకు సిద్ధమయ్యారు. వెంటనే విడాకులకు అంగీకరించకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించసాగారు. పలుమార్లు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతుండటంతో భార్య జీర్ణించుకోలేకపోయారు. నేరుగా సైబర్ పోలీసుస్టేషన్‌కు వెళ్ళి జరిగిన విషయమై ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి కిరణ్‌పాటిల్‌ను అదుపులోకి తీసుకుని వీడియోలు, ఫొటోలను డిలీట్ చేయించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కిరణ్‌ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు వెళ్ళిన సందర్భంలోను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించగా చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స జరిపించారు.

అస్థిపంజరాల కేసులో కీలక మలుపు

● ఏసీ మిషన్లు రన్నింగ్‌లో ఉన్న కారణంగా దుర్వాసన రాలేదు ● 2019 జనవరి నుంచి విద్యుత్ చెల్లించలేదు : బెస్కాం



అస్థిపంజరాలు దొరికిన ఇల్లు ఇదే

బళ్లారి గాంధీనగర్, జనవరి 4: చిత్రదుర్గ నగరం జైలు రోడ్డులో డిసెంబరు 29వ తేదీన ఒకే ఇంటిలో ఐదు అస్థిపంజరాలు వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నారు. ఘటనా స్థలంలో లభించిన ఐదు అస్థిపంజరాలకు సంబంధించి ఫోరెన్సిక్స్ నిపుణుల బృందం పూర్తిస్థాయిలో పరిశోధనలు చేస్తుండగా, నగర పోలీసు విభాగం వారు ఇంటిని స్వాధీనం చేసుకుని ఇంటిని, చుట్టుపక్కల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇంటిలో మృతి చెందిన ఐదుగురి మృతదేహాల నుండి దుర్వాసన గదినుండి బయటకు రాకపోవడానికి ఇంటిలో ఏర్పాటు చేసిన రెండు ఎయిర్ కండీషన్ మిషన్‌లు సుమారు నాలుగున్నర నెలల పాటు రన్నింగ్‌లో ఉండడమే కారణమని తెలుస్తోంది. ఇందువల్లనే ఐదుగురు మృతి చెందిన విషయం బయటకు పొక్కలేదని పోలీసులు నిర్ధారించారు. ఈ విషయం ఇంటికి వచ్చిన కరెంటు బిల్లు ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఇంటిలో క్యాలెండర్ ఆధారంగా 2019 సంవత్సరం జనవరి నెలలో ఈ ఘటన జరిగినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఇందుకు కారణం మృతుడు రిటైర్డ్ ఇంజనీయరు జగన్నాథ్ రెడ్డి పెన్షన్‌ను జనవరి నెల తరువాత ఎవరూ తీసుకోలేదనే విషయాన్ని పోలీసులు గుర్తించారు. అందువలన ఈ ఘటన జనవరి నెలలో జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇంటికి సంబంధించి విద్యుత్ బిల్లును చెల్లించని కారణంగా 2019 మే నెలలో ఇంటికి పవర్ కట్ చేసినట్లు విద్యుత్ శాఖ రికార్డులు తెలుపుతున్నాయి. అంటే మే నెల వరకు ఇంటికి ఏర్పాటు చేసిన ఎయిర్ కండీషనర్లు నాలుగు నెలల పాటు రన్నింగ్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇంటిలో ఉన్న ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ మీటర్లలో, ఇంటి ఉపయోగానికి ఏర్పాటు చేసిన విద్యుత్ మీటరు బిల్లు 6,237 రూపాయలు బకాయి ఉండగా, నీటి మోటారు కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ మీటరు బిల్లు రూ 2,850లు బకాయి ఉన్నట్లు బెస్కాం శాఖ ధృవీకరించింది. 2019 సంవత్సరం నుండి ఈ రెండు మీటర్లకు సంబంధించి విద్యుత్ బిల్లులు చెల్లించని కారణంగా 2020 ఏప్రిల్ నెలలో ఇల్లు ఖాళీగా ఉందని బెస్కాం విద్యుత్ శాఖ అధికారులు రికార్డుల్లో నమోదు చేస్తూ విద్యుత్‌ను కనెక్షన్ తొలగించినట్లు సమాచారం. ఇంటి నుంచి దుర్వాసన వస్తున్నట్లు 2019 సెప్టెంబరు నెలలో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఇంటి వద్దకు చేరుకున్న పోలీసులు ఇంటికి తాళం వేసిన దృశ్యాన్ని చూసి ఇంటిలో పెంపుడు జంతువులు కుక్క లేదా ఏదైనా పిల్లి చనిపోయి ఉండవచ్చని భావించి నిర్లక్ష్యం చేసి ఉండవచ్చని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

కొనసాగుతున్న ఆధారాలు సేకరణ

ఈ ఘటన వెలుగు చూసి ఆరు రోజులు గడుస్తున్నా పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణుల బృందం ఘటనా స్థలంలో ఆధారాల సేకరణ కొనసాగిస్తున్నారు ఇంటిలోపల, బయట పరిశోధన చేస్తున్నారు. పశువైద్యులు బృందం మంగళవారం ఇంటిలోపల మృతి చెందిన పెంపుడు కుక్క అస్థిపంజరాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇంటి ముందు భాగంలో ఏపుగా పెరిగిన ముళ్ళకంపలు తొలగించి ఆవరణలో అణువణువు క్షుణ్ణంగా పరిశీలన జరుపుతున్నారు. ఇంటిలో వస్తువులు చెల్లాచెదరుగా ఉండడం వలన ఇంటిలో వస్తువులు చోరీకి గురైనట్లు పోలీసులు భావిస్తున్నారు. ద్విచక్రవాహనానికి సంబంధించిన టైర్ కనిపించక పోవడం ఇంటిలో చోరీ జరిగిందనే విషయాన్ని ధృడపరుస్తోంది. కాంపౌండ్ ఆవరణలో మద్యం బాటిళ్ళు ఉన్న విషయాన్ని పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో ముగ్గురి అ అస్థిపంజరాలు ఒక మంచంపై, మరొకటి మంచం క్రింద, మరొకటి ఇంటిమధ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో ఒక పురుషుడి, ఒక మహిళ అస్థిపంజరాలు కాళ్ళకు తాళ్ళుకట్టిన స్థితిలో ఉన్నట్లు పోస్ట్‌మార్టమ్ రిపోర్టులో వెల్లడైనట్లు సమాచారం.



ఇంట్లో ఏర్పాటు చేసిన ఎయిర్ కండీషన్

7న రైతు సంక్రాంతి

బెంగళూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ భరతం వైభవానికి అద్దంపట్టే రైతు సంక్రాంతి వేడుకలు ఈ నెల 7న జరగనున్నాయి. బెంగళూరు బన్నెరుఘట్ట గొట్టిగెరె రాగికణలో ఇందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్థానిక రామకృష్ణ సమగ్ర శిక్షణా కేంద్రం పర్యావరణ కేంద్రంలో హుల్కుల్ మునిస్వామప్ప, మునివెంకటమ్మ ట్రస్టు సహకారంతో గ్రామ సేవా సంఘం 2017 నుంచి ప్రతి సంక్రాంతి వేళ ఇలా రైత సంక్రాంతి పండుగను నిర్వహిస్తోంది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తాము పండించిన సంక్రాంతి స్పెషల్ పంటలను ఈ మేళాకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. కంది, అవరేకాయ, వేరుశనగ, చిలకడదుంప, గుమ్మడికాయలు, బెల్లం, చెరుకు, పసుపు కొమ్ములు ఇత్యాది ఉత్పత్తులను రైతులు నేరుగా ప్రజలకు విక్రయిస్తారు. గ్రామీణ సంప్రదాయానికి అద్దంపట్టే రకరకాల ఆహార పదార్థాలతో కూడిన ఫుడ్ ఫెస్టివల్ కూడా ఈ సంక్రాంతి వైభవంలో ప్రత్యేక ఆకర్షణ కానుంది. గ్రామీణ రుచులను ఆస్వాదించే అవకాశంతో పాటు రైతులు పండించే రకరకాల ఉత్పత్తులను తాజాగా, సరసమైన ధరకు అందుకునే అవకాశం ఉంటుందని నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. ఈ రైత సంక్రాంతిలో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పాల్గొని అన్నదాతలను ప్రోత్సహించాలని విజ్ఞప్తిచేశారు.

జర్మనీ యువతితో కుందాపుర యువకుడి సంప్రదాయ వివాహం

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉడుపి జిల్లా కుందాపురకు చెందిన యువకుడు జర్మనీ యువతిని హిందూ సంప్రదాయ బ ద్ధంగా వివాహం చేసుకున్నారు. గురువారం కుందాపుర తాలూకా సిద్దాపుర చి త్తేరి బ్రహ్మలింగేశ్వర ఆలయంలో జరిగిన ఈ వివాహంలో ఇరు కుటుంబీకులు భాగస్వాములయ్యారు. కుం దాపుర తాలూకా అజ్రియ కరిమనెకు చెందిన సువర్ణ, పంజు పూజారి దంపతుల కుమారుడు చందన్ జర్మనీకు చెందిన పీటర్ శ్రూఆర్, మునిస్తర్ యునికబ్ దంపతుల కుమార్తె కారిన్‌లు వివాహం చేసుకున్నవారు. చందన్ జర్మనీలో ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. కారిన్ అక్కడే టీచర్‌గా ఉన్నారు. ఇద్దరి మధ్య ఏర్పడిన స్నేహం కాస్త ప్రేమగా మారి వివాహం దాకా సాగింది. ఇరు కుటుంబీకుల అంగీకారం మేరకే వివాహం చేసుకున్నట్లు వరుడు చందన్ తెలిపారు.



ఒక్కటైన జంట

6న ఫైనల్స్

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన యువత, పిల్లలకోసం 'క్విజేబుల్డ్ ఫైనల్స్' బసవనగుడిలోని బిఎంఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 6న జరుగనున్నాయి. 2016 లో ఈ తరహా పోటీలను ప్రారంభించి ప్రతియేటా క్రమం తప్పకుండా నిర్వహించుకుంటూ వస్తున్నామని నిర్వాహకులు నగరంలో గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సారి ఫైనల్స్‌లో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు మొత్తం పది రాష్ట్రాల నుంచి దివ్యాంగుల జట్లు పాలుపంచుకోబోతున్నాయి. దేశవ్యాప్తంగా 400 పాఠశాలలకు చెందిన 6వేల మంది ఈ పోటీలలో పాల్గొన్నారని ఫైనల్స్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4-30 వరకు జరుగుతాయని తెలిపారు. కాగా ఈ పోటీలను తిలకించాలనుకునే ఆసక్తి గలవారెవరైనా సరే ఉచితంగా పాల్గొనవచ్చునన్నారు. ఫైనల్స్‌కు కేంద్ర మంత్రి ఎ.నారాయణస్వామి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

డీ.హీరేహాళ్, జనవరి 4: అనంతపురం జిల్లా డీహీరేహాళ్ మండలంలోని హిర్దేహాళ్ గ్రామ సమీపంలో ఉన్న సపోటా తోటలో శివకుమార్(31) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... కర్ణాటక బళ్లారి జిల్లా కమ్మరిచేడు గ్రామానికి చెందిన శివకుమార్ మండలంలోని పులకుర్తి గ్రామంలో కృష్ణవేణిని వివాహం చేసుకున్నాడు. గత కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో భార్యతో పాటు వారంరోజుల క్రితం పులకుర్తి గ్రామానికి వచ్చాడు. ఈ తరుణంలో జనవరి ఒకటో తేదీన ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. ఆ రోజు నుంచి కుటుంబసభ్యులు అతని కోసం గాలిస్తున్నారు. పులకుర్తి, హీర్దేహాళ్ గ్రామాల స మీపంలో ఉరి వేసుకున్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● అడిషనల్ జిల్లా అధికారి కేఆర్ దుర్గేష్

రాయచూరు జనవరి 4 : ఈ నెల 6,7వ తేదీల్లో నిర్వహించే పోటీ పరీక్షలు పకడ్బందీగా జరిగేలా అన్ని పరీక్ష కేంద్రాల్లో తగిన ఏరాకపట్లు చేయాలని అడిషనల్ జిల్లాధికారి కేఆర్ దుర్గేష్ అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి గురువారం జిల్లాధికారి కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో పూర్వసిద్ధత సమావేశం నిర్వహించారు. గ్రూప్ సీ ఖాళీల భర్తీ కోసం నిర్వహించే పరీక్షలను జిల్లాలోని ఏడు కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు ఏడీసీ తెలిపారు. అన్ని కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అదే సమయంలో అన్ని పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షకు హాజరైయ్యేలా చూడాలని పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు అవకతవకలకు తావు లేకుండా సంబంధిత సూపరింటెండెంట్‌లు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణకు నియమితులైన అధికారులందరు అప్రమత్తంగా ఉంటు పరీక్షల నిర్వహణను పూర్తి చేయాలన్నారు.

అక్రమాలు జరిగితే కఠిన చర్యలు : ఎమ్మెల్యే

రాయచూరు జనవరి 4 : అక్రమ సక్రమ సాగువళి ఆధారంగా సాగు చేసే భూములకు సంబంధించి రైతులకు ధ్రువపత్రాలు ఇవ్వాలని రాయచూరు రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి అక్రమాలు జరిగినా సహించేదిలేదని కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గురువారం నగరంలోని అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) కార్యాలయంలో అక్రమ సక్రమ సాగువళిదారుల సమావేశానికి సంబంధించి కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. సభలో మాట్లాడిన రూరల్ ఎమ్మెల్యే గత కొన్నేళ్లుగా భూములను సాగు చేస్తున్న రైతులు ధ్రువ పత్రాల కోసం కార్యాలయాల చుట్టు తిరుగుతుండడాన్ని తీవ్రంగా పరిగణించారు. ఈ విషయంలో రైతులకు ఇబ్బందులు పెట్టవద్దని అదే సమయంలో వారికి ధ్రువపత్రాలు అందించేందుకు ముడుపులు స్వీకరిస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇప్పటికే పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో భూపంపిణీలో లబ్ధిపొందలేని వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులందకుండా చూసుకోవాలన్నారు. కాగా గ్రామీణ స్థాయిల్లో అక్రమ సక్రమ పథకం ద్వార భూములు సాగు చేస్తున్న వారి వివరాలను సమగ్రంగా గుర్తించాలని క్షేత్రస్థాయిలో వారి పొలాలు సర్వే నిర్వహించి హద్దులు చూయించాలని సూచించారు.



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే దద్దల బసనగౌడ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1589.05	1,623.91
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	000	8,551
సామర్థ్యం (టీఎంసీలు)	10.25	72.98

ముచ్చటగా మూడోసారి..

● 10 న మేయర్ ఎన్నిక ● డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా వెల్లడి

బళ్లారి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే పలుసార్లు వాయిదా పడిన బళ్లారి మేయర్ ఎన్నిక ముచ్చటగా మూడోసారి జనవరి 10న జరగనుంది. ఈ మేరకు బళ్లారి డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఒక ప్రకటన వెలువరించారు. మేయర్ ఎన్నికరోజు నగర పాలికె వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. కార్పొరేటర్లు.. మేయర్ ఎన్నికలో ఓటు ఉన్న వారు, అధికారులు మాత్రమే అక్కడికి రావాలని తెలిపారు. అధికారులు కూడా ఐడీ కార్డు ధరించి రావాలని తెలిపారు. ఎన్నికల జరిగే ప్రాంతం నుంచి 500 మీటర్ల దూరం వరకూ ఎవరూ ఉండరాదని పేర్కొన్నారు. శాంతి భద్రతల నిమిత్తం పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

రెండు పర్యాయాలు వాయిదా

బళ్లారి మేయర్ ఎన్నిక ఇప్పటికి రెండు దఫాలు వాయిదా పడింది. గతేడాది నవంబరు 28న ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. కానీ ఆరోజు అధికారి రాలేక పోవడం కారణంగా ఎన్నిక వాయిదా పడింది. తరువాత గతేడాది డిసెంబరు 20న ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే ఆరోజు ఎన్ఐఏ దాడుల నేపథ్యంలో ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 10న మరోసారి ముహూర్తం ఖరారయింది.

వాయిదాకు కారణాలు ఎన్నో!

కార్పొరేటర్లలో మేయర్ పదవి ఆశించే వారు ఎక్కువమంది ఉండడమే బళ్లారి మేయర్ ఎన్నిక పదేపదే వాయిదా పడేందుకు కారణమనుకోవచ్చు. వీరిలో మించు శ్రీనివాసులు, శ్వేత సోము, వి. కుబేరా పోటీ పడుతున్నారు. ఈ పదవి ఎస్టీ రిజర్వుడు కావడంతో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. ప్రధానంగా ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మంత్రి నాగేంద్ర, ఎంపీ నాసీర్ హూసేన్ మధ్య సమన్వయం లేకపోవడంతో మేయర్ ఎంపిక విషయం పదేపదే వాయిదా పడుతూ వస్తోందని కొందరు కార్పొరేటర్ల, కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. కానీ పైకి మాత్రం తమలో ఎటువంటి బేధాభిప్రాయాలు లేవని నాయకులు అంటున్నారు.

హైకమాండ్ ఎవరి పేరు ప్రతిపాదిస్తుందో..?

కాంగ్రెస్ పార్టీలో సుమారు 26 మంది కార్పొరేటర్లు ఉన్నారు.(ఐదుగురు ఇండిపెండెంట్లతో కలిపి) పూర్తి మెజార్టీ ఉన్నా కాంగ్రెస్‌లో మేయర్ పదవికి పోటీ ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో డిసెంబరు నెలలో బళ్లారి కాంగ్రెస్ నాయకులతో పాటు కార్పొరేటర్లను కూడా కేపీసీసీ బెంగళూరుకు పిలిపించి చర్చించింది. అందరి అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత మేయర్ పేరును తాము సీల్డు కవర్‌లో పంపుతామని అధిష్ఠానం చెప్పి వారందరినీ తిప్పి పంపింది. దీంతో కాంగ్రెస్ అధిష్టానవర్గం ఎవరిని మేయర్‌గా ప్రతిపాదించి పంపుతుందో అనే అసక్తి నెలకొంది. వాస్తవానికి 35వ వార్డు కార్పొరేటర్ మించు శ్రీనివాస్ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డికి, ఎమ్మెల్యే తండ్రి నారా సూర్య నారాయణరెడ్డికి ప్రధాన అనుచరుడు అని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ వాళ్లు మాత్రం తమకు ఏమీ తెలియదన్నట్లు చెబుతున్నారు. ఇక మంత్రి నాగేంద్ర మాత్రం కాంగ్రెస్ వారు ఎవరు మేయర్‌గా అయినా పర్వాలేదు అని అంటున్నారు. వీరి మాటలు ఇలా ఉన్నా రాజకీయంగా మాత్రం ఇద్దరూ వారి పంతం నెగ్గించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. బీజేపీ కార్పొరేటర్ల ప్రమేయం లేకుండానే కాంగ్రెస్ మేయర్ ఎన్నిక జరుగుతుందా..? లేదా బీజేపీ కార్పొరేటర్ల ప్రమేయంతో మేయర్ ఎన్నిక జరుగుతుందా..? అనే విషయమై రాజకీయ చర్చసాగుతోంది.

నిర్మానుష్యంగా పాతకోర్టు ప్రాంగణం



చెత్తాచెదారంతో నిండిన పాతకోర్టు ప్రాంగణం

బళ్లారి గాంధీనగర్, జనవరి 4: డిసెంబరు నెలలో బళ్ళారి న్యాయస్థానాలన్నీ నూతనంగా నిర్మించిన భవనస ముదాయంలోకి మారడంతో వారం రోజుల క్రితం వరకు సేవలు అందించిన పాత కోర్టు ప్రాంగణం ప్రస్తుతం కక్షి దారులు, న్యాయవాదులు, ప్రజలు లేక నిర్మానుష్యంగా మారింది. విశాలమైన కోర్టు ఆవరణ అంతా బోసిపోయిం దని చెప్పవచ్చు. బళ్లారి చారిత్రాత్మక కట్టడాల జాబితా ల్లోకి కోర్టు చేరిపోయిందని చెప్పవచ్చు. నిన్నటి మొన్నటి వరకు జిల్లా కోర్టు నిర్వహణ బాధ్యతలు ప్రజా పనులు శాఖ చేపట్టేది. కొత్తకోర్టు ఏర్పాటుతో పాతకోర్టు ప్రాంగణం నిర్వహణ లేక అపరిశుభ్రంగా మారింది. కోర్టు ప్రధాన గేటు ప్రక్కన ఓ గార్డు మినహా... కోర్టు ప్రాంగణంలో ఎవరూ కనిపించకపోవడంతో బోసిపోయింది. ఈ ప్రాంగ ణాన్ని జిల్లా యంత్రాంగం స్వాధీనం చేసుకుని నగరంలో అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ఇక్కడ తరలిస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని సీనియర్ సిటి జన్లు వ్యక్తం చేస్తున్నారు. అప్పటి వరకు ఈ ప్రాంగణంలో పేరుకు పోయిన చెత్తాచెదారాలను తొలగించేలా కార్పొరే షన్ కమిషనర్ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

తృణధాన్యాలపై అవగాహన కోసం నడక



తృణధాన్యాల అవగాహనపై నడకను ప్రారంభిస్తున్న డీసీ

బళ్లారి సిటీ, జనవరి 4: నగరంలోని కలెక్టర్ కార్యా లయం వద్ద గురువారం తృణ ధాన్యాలపై అవగాహన నడకను జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తప్పకుండా తృణ ధాన్యాలను ఉపయోగించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. తృణధాన్యాల వలన శరీరానికి అన్ని రకా లైన పోషకాంశాలు లభిస్తాయన్నారు. జిల్లాకలెక్టర్ కార్యా లయం నుంచి ప్రారంభమైన ఈ నడక గవియప్పసర్కిల్, కనకదుర్గమ్మ దేవాలయం, గడిగిచెన్నప్ప సర్కిల్ మీదుగా తిరిగి జిల్లా కార్యాలయ ఆవరణకు చేరుకుంది. ఊరేగిం పులో డొల్లు కుణిత, ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈసం దర్భంగా పలు సందేశాలతో కూడిన బోర్డులను ప్రదర్శిం చారు. ఈసందర్భంగా జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వ హణాధికారి రాహుల్ శరణప్ప సంకనూర్, జిల్లా అదనపు కలెక్టర్ మహ్మద్ జుబేరా, వ్యవసాయ సంయుక్త సంచాల కులు కె.మల్లికార్జున తదితర వ్యవసాయ అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యువజనోత్సవ వేదిక మార్పు

బళ్లారి సిటీ, జనవరి 4: రాష్ట్రస్థాయి యువజనోత్స వాలను మున్సిపల్ కళాశాల మైదానం నుంచి నగరం లోని వాల్మీకి భవనంలోకి మార్పుచేస్తున్నామని యువజన సాధికారత, క్రీడలశాఖ సహాయ సంచాలకులు కే.గ్రేసి తెలిపారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

7న జ్ఞానామృత పీయూ కాలేజీలో టాలెంట్ పరీక్షలు

బళ్లారి సిటీ, జనవరి 4: నగరంలోని జ్ఞానామృత పీయూ కళాశాలలో టాలెంట్ సెర్చ్ పరీక్షలను ఆదివారం 7న నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యశ్వంత్‌శెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సంవత్సరానికి స్కాలర్‌షిప్ తోపాటు మొదటి పీయూసీ సైన్స్, కామర్స్ విభాగాల్లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు ఈపరీక్షకు హాజరు కావాలన్నారు. స్టేట్ బోర్డు, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ పాఠ్యాంశాలకు సంబంధించిన విషయాలపై పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పీయూ ప్రవేశం కోరుకునే విద్యార్థులకు ఇదొక మంచి అవకాశమని సంస్థ అధ్యక్షులు ఎంజీ.గౌడ తెలిపారు. విద్యారంగంలో అగ్రగామిగా ఉన్న ఈసంస్థ వరుసగా ద్వితీయ పీయూ బోర్డు పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. వివరాలకు 9606542999, 9606842999 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



జ్ఞానామృత పీయూ కళాశాల భవనం

కారేకల్లు పంచాయతీలో ఇకపై ఈ-హాజరు

● పంచాయతీ కార్యాలయానికి తాళం వేయడం తప్పే
● సంబంధిత అధికారులు, సిబ్బందికి నోటీసులు
● బళ్ళారి టీపీ ఈఓ మడగిన బసప్ప వెల్లడి

బళ్లారి గాంధీనగర్, జనవరి 4 ఈ ఏడాది జనవరి నుంచి కారేకల్లు గ్రామ పంచా యితీలో ఈ-హాజరు విధానం అమల్లోకి తీసుకొస్తున్నట్లు బళ్ళారి తాలూకా పంచాయతీ కార్యనిర్వహణ అధికారి మడిగిన బసప్ప పేర్కొన్నారు. ఈ-హాజరు ఆధారంగానే గ్రామ పంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి వేతనాలు చెల్లించాలని జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. ఆంధ్రజ్యోతిలో గురువారం 'విహారంలో అధికారులు.. ఇబ్బందుల్లో ప్రజలు' అనే శీర్షికతో కారేకల్లు పంచాయతీ తీరు గురించి వెలువడిన కథనంపై బళ్ళారి తాలూకా కార్యనిర్వహణ అధికారి స్పందించారు. ఈ నెల 1వ తేదీ నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేయడంపై సంబంధిత గ్రామ పంచాయితీ అధికారి, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. కారేకల్లు గ్రామ పంచాయితీ పిడిఓ ఈనెల 1, 2 తేదీల్లో సెలవు కోసం అనుమతి తీసుకున్నారని, అయితే మిగిలిన సిబ్బంది ఎందుకు గైర్హాజ రయ్యారో తెలియజేయాలని పిడిఓ రుద్రప్పను ఆదేశించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి ప్రభుత్వ సెలవుల్లో మినహా... ఎలాంటి సమయంలోనైనా తాళం వేయరాదని, ఈనెల 1వ తేదీ నుంచి గ్రామ పంచాయతీకి తాళం వేయడంపై సిబ్బందిని వివరణ కోరుతూ నోటీసులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త తీసుకుంటూ ఈ-హాజరు పద్ధతిని పటిష్టంగా అమలు పరుస్తామన్నారు.



ఈఓ మడగిన బసప్ప

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జేసీఎల్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ ప్రారంభం

బళ్లారిరూరల్, జనవరి 4 : తాలుకాలోని సిడిగినమల గ్రామంలో వాల్మీకి సముదాయ భవన్‌లో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని జేసీఎల్ అడ్మినిస్ట్రేటివ్ జనరల్ మేనేజర్ అన్వర్ బాషా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు కుట్టుమిషన్ల ద్వారా వారికి జీవనోపాధి వుంటుందని, మహిళలు ఇలాంటి కుట్టు మిషన్లతో పాటు డ్రాయింగ్ తదితర వాటిని నేర్చుకుంటే తమజీవనానికి అనుకూలంగా వుంటుందని తెలిపారు. కుట్టు నేర్చుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం వుంటుందన్నారు. మహిళలు ఇలాంటి వాటిపై శ్రద్దవహించి జీవితం లో ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు తమ సంస్థ నుంచి తగిన సహాయ సహకా రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ విశ్వనాథ్, సేఫ్టీ ఆఫీసర్ నాగశేఖర్, డిప్యూటీ మేనేజర్ జడేస్వామి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

రెయిన్‌బో కళాశాల విద్యార్థులకు సౌకర్యాలు

కంప్లి, జనవరి 4 : కంప్లి సన్నాపురం రోడ్డులో నూతనంగా నిర్మించిన కేసీటీ ఎడ్యుకే షన్ ట్రస్టు ఆధ్వర్యంలో రెయిన్ బో ఇంటర్మీడి యట్ కళాశాల సదుపాయాలను సద్వినియో గం చేసుకోవాలని కళాశాల కార్యదర్శి కేఎస్ చాంద్‌బాషా తెలిపారు. ఈ కళాశాల నూత నంగా ఏర్పడటం జరిగిందని ఇక్కడ పీసీఎంబీ, కేసిట్, నీట్, పీసీఎంసీ, జేడబ్ల్యూ, సీబీఏ, సీపీటీ, తాలి కోర్సులు కూడా వుంటాయన్నారు. జన వరి 2024 నుంచి ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. 9, 10 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ కూడా వుంటుందన్నారు. కంప్లి, కురుగోడు, కుడితిని, పదవ తరగతి విద్యార్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న చాంద్ బాషా

నేడు పరమహంస యోగానంద జయంతి



బళ్లారి సిటీ, జనవరి 4: నగరం లోని ఇన్నారెడ్డి కాలనీలోని యోగాస త్సాంగ ధ్యానకేంద్రంలో శుక్రవారం పర మహంస యోగానంద 130వ జయం తిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్ర మాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సత్యనారాయణరెడ్డి, ఈశ్వర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 5న ప్రపంచవ్యాప్తంగా యోగా నంద జయంతిని జరుపుకుంటున్నట్లు తెలిపారు. విదేశీయులకు సైతం యోగా ధ్యానం గురించి అవగాహన కల్పించిన గొప్పవ్యక్తి అని యోగానంద తెలిపారు. భారతదేశంలోని ప్రాచీన అధ్యాత్మికత గురించి వారికి బోధిస్తూ 30 ఏళ్లకు పైబడి విదేశాల్లో గడిపారన్నారు. 'క్రియా యోగా' గురించిన ఆయన బోధనలు జిజ్ఞాసువులందరికీ మార్గదర్శకంగా మారాయన్నారు. అందరూ పాల్గొని ఈ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు.

శివయోగి మండపంలో ప్రారంభమైన పూజలు



బుక్కసాగరలో కరిసిద్దేశ్వర శివయోగి పూజను ప్రారంభిస్తున్న స్వామి

కంప్లి, జనవరి 4 : బుక్కసాగర కరిసిద్దేశ్వర శివయోగి మండపంలో 11వ సం స్మరణ సందర్భంగా సుమారు 3 నుంచి 17 వరకు వివిధ పూజా కార్యక్రమాలు, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజున మల్లికా ర్జున శివాచార్య మహాస్వాములు ఈ పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పుణ్యారాధన సందర్భంగా 14 రోజుల పాటు శివశరణు సజ్జల బుడద శరణమ్మ నీలామృత ప్రవచనాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు పూజా కార్యక్రమాల్లో పాల్గొని 11వ పుణ్యస్మరణ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వారితోపాటు కరిసిద్దేశ్వర శివాచార్య హిరేమఠ్ స్వాములు, శశిధర శాస్త్రి, నాగభూషణ, వివిధ మఠాధీశ్వరులు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి మంజునాథ

సిరుగుప్ప, జనవరి 4: అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని బళ్లారి జిల్లా నోడల్ అధికారి మంజునాథ తెలిపారు. బుధవారం సిరుగుప్ప పట్టణంలో తాలుకా పంచాయతీ భవనంలో అభివృద్ధి విషయంపై ప్రభుత్వ స్థాయి అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నోడల్ అధికారి మంజునాథ అన్ని శాఖలలో అభివృద్ధి పనులు చేపట్టడంపై అధికారుల నుంచి సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విశ్వనాథ, ఈవో పవన్ కుమార్, వివిధ శాఖల అధికా రులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర ఏపీఎంసీ చట్టానికి రూపకల్పన

రాయచూరు జనవరి 4 : వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతుల ప్రయోజనాను కాపాడేం దుకు వీలుగా త్వరలోనే ఏపీ ఎంసీ సవరణచట్టాన్ని సమ గ్రంగా రూపొందిస్తామని మార్కె టింగ్‌శాఖ మంత్రి శివానంద పాటిల్ తెలిపారు. ప్రభుత్వం తీసు కొస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ వ్యవహారాల నియంత్రణ అభివృద్ధి సవ రణ చట్టం-2023కి సంబంధించి గురువారం నగరంలోని ఏపీఎంసి ఆవరణలో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రైతు ప్రతినిధులు, పాత్రికేయులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవరణ చట్టానికి సంబంధించి తగిన ప్రతిపాదనలు చేసేలా తమ ప్రభుత్వం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టిందన్నారు.



మాట్లాడుతున్న మంత్రి

హోసూరు జోన్

తగ్గిన పూల మొక్కల అమ్మకం

రైతుల ఆందోళన



హోసూరు (మత్తిగిరి) జనవరి 4: నర్సరీలలో పూల మొక్కల విక్రయాలు మందగించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. హోసూరు సమీపంలోని బాగలూరు, బేరికై, అగలకోటై, మేలుముత్తుకోట, చెట్టిపల్లి, బాలతోటనపల్లి, వనగ నపల్లి, కల్లుబాళం, మరగదదొడ్డితోపాటు 20కిపైగా గ్రామాల వారు నర్సరీ గార్డెన్‌లు ఏర్పాటు చేసుకుని పూల మొక్కలను పెంచుతుంటారు. రోజా, సెంట్‌రోజా, గిల్లి, ఎల్లో, ముక్కుపుడుక రోజా, తాజ్‌మహల్, నోయ్‌ప్లాస్, లాంటి 50కిపైగా పూలచెట్లను తెలంగాణ, కేరళతోపాటు తమిళనాడులోని పలు జిల్లాలకు పంపుతుంటారు. కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, చెన్నై, తూత్తుకుడి, తిరునల్వేలి ప్రాంతాల్లో నిరంతరాయంగా కురు స్తున్న వర్షాల వలన రాకపోకలు స్తంభించిపోయాయి. మామూలుగా ఈ సీజన్‌లో క్రిస్మస్, కొత్త సంవత్సరం, పొంగల్, ప్రేమికులరోజు ఒకదాని తర్వాత ఒకటి జరుపుకుంటూ ఉంటారు. ఈ సంవత్సరం వర్షాల కారణంగా మొక్కల నారు కుళ్లిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి) జనవరి 4 : కృష్ణగిరి మున్సిపాలిటీ పాత పేట బస్టాండ్ దగ్గర ఇంటిగ్రేటేడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు గురువారం తనిఖీ చేశారు, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మధ్యాహ్న భోజనం వండేందుకు వంటపాత్రలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యా లను కలెక్టర్ పరిశీలించారు.